ఇంటింటా 'బస్తీ అభియాన్'

'బస్తీ అభియాన్'లో భాగంగా బన్సీలాల్ పేట్ డివిజన్‌లోని బూత్ నంబర్ 80లో గురువారం ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర. ఈ కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఉమేశ్, నాయకులు ప్రసాద్, రమణ, ప్రవీణ్, స్వప్న, కోమల్, నరేందర్, కిరణ్, ధన్‌రాజ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

– బన్సీలాల్‌పేట్, ఫిబ్రవరి 8

పవర్ బోర్‌వెల్ పనులు ప్రారంభం

బస్తీవాసులు నీటి ఎద్దడితో ఇబ్బందులు పడకుండా ఎమ్మెల్యే లాస్య నందిత నిధులతో గురువారం ఏడో వార్డు పరిధిలోని 'లాల్‌బజార్ పెరుమాళ్ హట్స్ బస్తీ'లో పవర్ బోర్‌వెల్ పనులు ప్రారంభించామని ఏడో వార్డు బోర్డు మాజీ సభ్యుడు శ్యామ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు పాల్గొన్నారు.

– బొల్లారం, ఫిబ్రవరి 8

చిట్టీల పేరిట మోసం

నిందితుడిపై బంజారాహిల్స్ పీఎస్‌లో కేసు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 8: చిట్టీల పేరుతో డబ్బులు వసూలు చేసి ముఖం చాటేసిన వ్యక్తిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.., ప్రేమ్‌నగర్‌కు చెందిన ఎస్.జయరాముడుతో పాటు అతడి భార్య రేణుకాదేవి, కొడుకు ఉపేందర్‌బాబు తదితరులు బంజారాహిల్స్ రోడ్ నం.12లోని ఎన్‌బీటీనగర్‌లో ఉంటున్న నాగరాజు యాదవ్ అనే వ్యక్తి వద్ద 2018 నుంచి చిట్టీలు వేస్తున్నారు. వీరితో పాటు మోతీనగర్‌కు చెందిన అతడి స్నేహితుడు వెంకట్‌రెడ్డి కూడా చిట్టీ వేశాడు. వీరంతా కలిసి సుమారు 19.75 లక్షలు చెల్లించారు. కాగా, చిట్టీ గడువు ముగిసినా నాగరాజు యాదవ్ డబ్బులు చెల్లించకపోగా ముఖం చాటేయడం ప్రారంభించాడు. పలుమార్లు అడిగినా డబ్బులు ఇవ్వకపోవడంతో పాటు ఇటీవల ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసుకుని ఉడాయించాడు. దీంతో తమను మోసం చేసిన నిందితుడిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు జయరాముడు గురువారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఐపీసీ 420, 406 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

10న సనత్‌నగర్ విజయోత్సవ సభ

సభను విజయవంతం చేయాలని కార్పొరేటర్ కే.హేమలత పిలుపు

బన్సీలాల్‌పేట్, ఫిబ్రవరి 8: సనత్‌నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ విజయోత్సవ సభ ఈ నెల 10వ తేదీన మహబూబ్ కళాశాలలోని ఎస్‌వీఐటీ ఆడిటోరియంలో జరుగనుందని బన్సీలాల్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ కే.హేమలత తెలిపారు. మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధ్యక్షతన జరిగే ఈ సభలో ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావు, మాజీ మంత్రి టి.హరీశ్‌రావులు హాజరవుతారని తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె బన్సీలాల్‌పేట్‌లో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. నగరానికి చెందిన పలువురు ఎమ్మెల్యేలు, అన్ని డివిజన్ల కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు హాజరవుతారని, ప్రతి బస్తీ నుంచి పార్టీ అభిమానులు, కార్యకర్తలు హాజరై ఈ సభను విజయవంతం చేయాలని ఆమె కోరారు. అదే విధంగా పద్మారావునగర్‌కు చెందిన పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు గురువారం మారేడ్‌పల్లిలోని నివాసంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిశారు. శనివారం (10వ తేదీన) జరిగే పార్టీ విజయోత్సవ సభకు పెద్ద ఎత్తున కార్యకర్తలను సమీకరిస్తామని బన్సీలాల్‌పేట్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేశన్ రాజు తెలిపారు.

ఎమ్మెల్యే తలసానిని కలిసిన పద్మారావునగర్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

అభివృద్ధి పనుల నిర్వహణకు చర్యలు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 8: జూబ్లీహిల్స్ డివిజన్‌లోని 23 బస్తీలలో అభివృద్ధి పనులను చేపట్టేందుకు త్వరలో చర్యలు తీసుకుంటామని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ సీనియర్ నేత మామిడి నర్సింగరావుతో పాటు వివిధ బస్తీలకు చెందిన నాయకులు, బస్తీ అధ్యక్షులు ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను గురువారం కలిసి ఆయా బస్తీల్లో చేపట్టాల్సిన పనులకు సంబంధించిన వినతిపత్రాలు అందజేశారు. ఇటీవల తామంతా సమావేశమై ప్రాధాన్యత అంశాలపై చర్చించామని, రోడ్లు, సివరేజ్ లైన్లు, మంచినీటి లైన్లు తదితర పనులను చేపట్టాలని కోరారు. ఫిలింనగర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు, అంగన్‌వాడీల భవనాల నిర్మాణం, బసవతారకం నగర్ ఉర్దూ మీడియం స్కూల్‌పై అదనపు స్లాబ్స్, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం, బీజేఆర్‌నగర్‌లో ప్రభుత్వ ఆస్పత్రి తదితర పనులు చేపట్టాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే దానం నాగేందర్ సానుకూలంగా స్పందించారు.

మహిళా డిగ్రీ కళాశాలకు స్థలాన్ని సేకరించండి

- త్వరలో నివేదిక పంపించాలని ఆర్డీవోకు హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశం
- మహేంద్రాహిల్స్‌లోని గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను సందర్శించిన కలెక్టర్

మారేడ్‌పల్లి, ఫిబ్రవరి 8: మహేంద్రాహిల్స్‌లో సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం ఐదు ఎకరాల స్థలాన్ని సేకరించాలని, త్వరలో నివేదికను పంపించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సికింద్రాబాద్ ఆర్డీవో రవిని ఆదేశించారు. మహేంద్రాహిల్స్‌లోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను గురువారం కలెక్టర్ అనుదీప్ సందర్శించారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు విద్యా బోధనలు ఏ విధంగా బోధిస్తున్నారు, ప్రభుత్వం అందించే నాణ్యమైన భోజనం గురించి కలెక్టర్ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసర ప్రాంతాల్లో ఉన్న టాయిలెట్స్, తాగునీరు, తరగతి గదులు, డార్మెంటరీ గదులను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి కలెక్టర్ అనుదీప్ భోజనం చేశారు. ఈ రోజు మాదిరిగానే విద్యార్థులకు ప్రతి రోజు భోజనం అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్, రంగారెడ్డి రీజినల్ కో ఆర్డినేటర్ నాగకల్యాణి, మారేడ్‌పల్లి తహసీల్దార్ పద్మసుందరి, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహేంద్రాహిల్స్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఆర్కేపురం బ్రిడ్జి వద్ద ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలిస్తున్న మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

ఆర్కేపురం చెరువు అభివృద్ధి పనులు పరిశీలన

నేరేడ్‌మెట్, ఫిబ్రవరి 8: నేరేడ్‌మెట్ డివిజన్ ఆర్కేపురం చెరువులో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం ఇరిగేషన్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్కేపురం లోని బ్రిడ్జి సమాంతరంగా నూతన బ్రిడ్జి ప్రతిపాదనలపై రైల్వే, ప్రాజెక్ట్ ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించారు. వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. అనంతరం ఆర్కేపురం చెరువు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాదఖ్ రైల్వే బ్రిడ్జి ఇంజినీర్ జగదీశ్, ఎస్‌సీ ప్రసాద్, ప్రకాశ్, జీహెచ్ఎంసీ ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ సురేశ్, డి. ఈ రేణుక, ఏఈ సాయికృష్ణ, బీఆర్ఎస్ నాయకులు జీకే హన్మంతరావు, ఉపేందర్, పరశురాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి వినతిపత్రం ఇస్తున్న ట్రస్ట్ చైర్మన్, వైస్ చైర్మన్ సత్యనారాయణ రాజు, ఎత్తిరి అంతయ్య

చిక్కడపల్లి, ఫిబ్రవరి 8 : దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వడ్డెర్ల ఆత్మ గౌరవ భవన సముదాయ ట్రస్ట్ చైర్మన్, వైస్ చైర్మన్ జెరిపేట సత్యనారాయణ రాజు, ఎత్తిరి అంతయ్యలు కోరారు. ఈ మేరకు గురువారం వారు.. రాష్ట్ర ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ వ్యవహారాల సలహాదారుడు మహమ్మద్ షబ్బీర్ అలీని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో 30 లక్షల జనాభా ఉన్నామని, 1976 కంటే ముందు వడ్డెర్లతో పాటుగా లంబాడ, ఎరుకల, యానాది, కైకేయ్ అనే కులాలు కూడా డీఎన్‌టీలోనే ఉన్నాయని, 1976 తరువాత లంబాడ, ఎరుకల, యానాది, కైకేయ్ కులాలను ఎస్టీలో చేర్చి, వడ్డెరులను మాత్రం బీసీ జాబితాలో చేర్చి తమకు తీవ్ర అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చి తమకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్లు డాక్టర్ ఓర్సు కృష్ణయ్య, బండారి శ్రీరాములు, మక్కలి వెంకటేశ్, సాయికృష్ణ, రాములు, వెంకటకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటకం

చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో మాజీ ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం నిర్వహించిన సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటక ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. విశ్రాంత జస్టిస్ బూర్గుల మధుసూదన్ ముఖ్య అతిథిగా పాల్గొని కళాకారుడు డాక్టర్ సులాపాణికి పురస్కారాన్ని అందించి సత్కరించారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో త్రినాథరావు, గాన సభ పాలకమండలి సభ్యుడు బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

– ముషీరాబాద్, ఫిబ్రవరి 8

'శ్రీ వేంకటేశ్వర వ్రతకల్పం' పుస్తకావిష్కరణ

హిందూ ఆచార్య సభ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో 'శ్రీ వేంకటేశ్వర వ్రతకల్పం' పుస్తకాన్ని గురువారం నేరేడ్‌మెట్ జీకే కాలనీలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకుడు, వ్యాపారవేత్త జీకే హన్మంతరావు, శివ చేతులమీదుగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి, బాబురావు, శంకర్ రావు, శ్రీనాథ్ పాల్గొన్నారు.

– నేరేడ్‌మెట్, ఫిబ్రవరి 8

త్వరలో ఓపెన్ జిమ్ ఏర్పాటు

టీఆర్‌టీ పార్కును పరిశీలించిన కార్పొరేటర్ సామల హేమ

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 8: సీతాఫల్‌మండి డివిజన్ టీఆర్‌టీ క్వార్టర్స్ లోని పార్కును స్థానిక కార్పొరేటర్ సామల హేమ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్కు పచ్చదనానికి కృషి చేస్తున్నామని, కాలనీవాసులు సాయంత్రం వేళ కూర్చునేందుకు బెంచులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. త్వరలో ఓపెన్ జిమ్ కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే ఎమ్మెల్యే పద్మారావు నిధులు మంజూరు చేశారని, ఎన్నికల కోడ్ నేపథ్యంలో పనులు ఆలస్యమయ్యాయని, త్వరలోనే ఇందిరానగర్, టీఆర్‌టీ పార్క్‌లో ఓపెన్ జిమ్ పనులు ప్రారంభిస్తామని ఆమె వెల్లడించారు.

టీఆర్‌టీ పార్కును పరిశీలిస్తున్న కార్పొరేటర్ సామల హేమ

సికింద్రాబాద్ ఓటర్ల తుది జాబితా ప్రచురణ

ఓటరు జాబితాను విడుదల చేస్తున్న అధికారులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 8: సికింద్రాబాద్ నియోజకవర్గ ఓటర్ల తుది జాబితాను ప్రచురించినట్లు గురువారం ఈఆర్‌వో, డిప్యూటీ కమిషనర్ సుధాంష్, ప్రత్యేక అధికారి మైకేల్ బోస్ తెలిపారు. ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 2,67,282 మంది ఓటర్లు ఉండగా అందులో 1,33,650 మంది పురుషులు, 1,33,607 మంది మహిళలు, ఇతరులు 25 మంది ఉన్నారని తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల కోసం వారికి 220 పోలింగ్ స్టేషన్‌లు కేటాయించామని, జాబితాను గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలకు అందిస్తామని, ఆన్‌లైన్‌లో కూడా ఈ జాబితా అందుబాటులో ఉంటుందని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు భుజేందర్‌బాబు, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు కల్పించాలని వినతి

తిరుమలగిరి విద్యుత్ కార్యాలయం ఎదుట నిరసన చేస్తున్న మీటర్ రీడర్స్

బొల్లారం, ఫిబ్రవరి 8: తెలంగాణ రాష్ట్ర విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ కార్మికులు గురువారం తిరుమలగిరి గన్‌రాక్ ఎస్ఈ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. అనంతరం వారు సూపరింటెండెంట్ ఇంజినీర్‌కి వినతి పత్రం అందజేశారు. ఎన్నో ఏండ్లుగా తమకు కనీస వేతనాలు కల్పించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 'గృహజ్యోతి' పథకంలో భాగంగా ప్రతి వినియోగదారుడి ఆధార్, రేషన్, ఫోన్ నంబర్ నమోదు చేయాలని ఆదేశాలు ఇవ్వడంతో పని ఒత్తిడి పెరుగుతుందన్నారు. తమకు కనీస వేతనం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

27 నుంచి సర్టిఫికెట్ కోర్స్ ఇన్ యోగా పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 8: ఉస్మానియా యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్‌సీడీఈ) ద్వారా అందించే 'సర్టిఫికెట్ కోర్స్ ఇన్ యోగా పరీక్షా' తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 27వ తేదీ నుంచి నిర్వహించనున్నామని, పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ చూసుకోవాలని సూచించారు.

బీ ఫార్మసీ పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీ ఫార్మసీ పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీ ఫార్మసీ (పీసీఐ) మొదటి, మూడు, అయిదు, ఏడో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షా ఫీజును ఈ నెల 20వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని సూచించారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహిస్తామని, పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

పీజీ కోర్సుల చాలెంజ్ వాల్యుయేషన్‌కు దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 8: ఉస్మానియా యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్‌సీడీఈ) ద్వారా అందించే పీజీ కోర్సుల చాలెంజ్ వాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకామ్ తదితర కోర్సుల మొదటి, రెండో సంవత్సరం పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని తెలిపారు. ఈ ఫలితాలపై సందేహాలు ఉన్నవారు ఒక్కో పేపర్‌కు రూ.10,000 చొప్పున చెల్లించి, ఈ నెల 28వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జవాబు పత్రాల నకలు కావాలంటే ఒక్కో పేపర్‌కు రూ.1,000 చొప్పున చెల్లించి వచ్చే నెల 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

మంజూరైన అభివృద్ధి పనులు చేపట్టాలి

- జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్
- రామస్వామి కాంపౌండ్ బస్తీలో పర్యటన

బన్సీలాల్‌పేట్, ఫిబ్రవరి 8: గతంలో నిధులు మంజూరైన అభివృద్ధి పనులను వెంటనే చేపట్టాలని జోనల్ కమిషనర్ రవికిరణ్ అధికారులను ఆదేశించారు. గురువారం రామస్వామి కాంపౌండ్ బస్తీలో పారిశుధ్య పనుల నిర్వహణ పరిశీలించడానికి బేగంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శంకర్, స్థానిక కార్పొరేటర్ కే.హేమలతతో కలిసి ఆయన గురువారం పర్యటించారు. మైదానంలో ఉన్న మట్టిని వెంటనే తొలగించాలని, ప్రతిరోజు పారిశుద్ధ్యం నెలకొల్పాలని వారు సిబ్బందికి సూచించారు. బస్తీ వెనక వైపు ఉన్న ఓపెన్ నాలాలో పూడికను తొలగించాలని, శిథిలావస్థకు చేరిన మల్లెపూల బావిని పునరుద్ధరించాలన్నారు. బస్తీలో అనేక ఏండ్ల నుంచి ఉంటున్న తమ నివాసాలకు భద్రత లేదని, ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుని తమకు రక్షణ కల్పించాలని బస్తీ నాయకులు జీహెచ్ ఎంసీ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ ఆంజనేయులు, ఏఈ నవీన్, ఎంటమాలజీ ఏఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏరియా ఇన్‌చార్జి సౌజన్య, సూపర్‌వైజర్ శంకర్, బస్తీ అధ్యక్షుడు సుధాకర్, నాయకులు కే.లక్ష్మీపతి, నాగభూశణం, సురేశ్, ఆనంద్, రాజు, అశోక్, కణ్ణన్, మల్లేశ్, ప్రవీణ్, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

రామస్వామి కాంపౌండ్ బస్తీవాసులతో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ రవికిరణ్, డీసీ శంకర్

కష్టపడకుండా.. ఇష్టపడి చదవండి: డీఈఓ

ఎర్రగడ్డ, ఫిబ్రవరి 8: బోధనా పద్ధతుల్లో వచ్చిన మార్పుల కారణంగా కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన ఉన్నదని డీఈఓ రోహిణి అన్నారు. బోరబండ నాట్కో ప్రభుత్వోన్నత పాఠశాల విద్యార్థులకు ఇటీవల క్రీడా పోటీలు నిర్వహించగా, బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి గురువారం ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి రోహిణి మాట్లాడుతూ, పరీక్షలు దగ్గర పడుతుంటే కష్టపడి చదవటం కన్నా, ఎప్పటికప్పుడు ఇష్టపడి చదివితేనే మంచిదన్న విషయాన్ని విద్యార్థులు గ్రహించాలన్నారు. జిల్లాలోని దాదాపు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సకల వసతులను సమకూర్చటం జరిగిందన్నారు. చదువుతో పాటు క్రీడాంశాల్లో రాణించటానికి విద్యార్థులకు శిక్షణ లభించేలా చేస్తామని అన్నారు. ఈ సారి టెన్త్ పరీక్షల్లో నాట్కో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించాలన్న ఆశాభావాన్ని అమె వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం గీతతో పాటు బోరబండ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డి, ఉప విద్యాధికారి సామ్యూల్ రాజు, ఉపాధ్యాయులు ప్రేమవాణి, లక్ష్మీకుమారి, శ్రీనివాసరావు, పవన్ కుమార్, ఫిజికల్ డైరక్టర్ శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఈఓ రోహిణి

ఎన్‌సీడీ యాప్‌లో ఆభా కార్డుల అనుసంధానం

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 8: సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణకు గతంలో తెలంగాణ ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ప్రవేశపెట్టిన నాన్ కమ్యునికేబుల్ డిసీజెస్‌ను పూర్తిస్థాయిలో కంప్యూటరీకరిస్తున్నారు. ఎన్‌సీడీ వ్యాధుల జాబితాను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ (ఆభా) కార్డులకు అనుసంధానం చేస్తున్నారు. ఇందులో భాగంగా తెలంగాణ వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పీహెచ్‌సీల వైద్య సిబ్బంది అనారోగ్య సమస్యలపై క్రమం తప్పకుండా సర్వే నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా నాన్ కమ్యునికేబుల్ డిసీజెస్ నివారణకు ఇప్పటికే మందుల కిట్లను ఇంటింటికీ పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. కాగా, పీహెచ్‌సీ పరిధిలోని వైద్య సిబ్బంది ఆయా గృహాలలో 30 ఏండ్లు పైబడిన వారికి మందుల కిట్లతో పాటు ఎన్‌సీడీ యాప్‌లో ఆభా కార్డుల నమోదు చేపడుతున్నారు. ఎన్‌సీడీలో ఆయా లక్షణాలున్న వారు అధిక రక్తపోటు, మధుమేహం నియంత్రణలో ఉండేందుకు క్రమం తప్పకుండా మందులు పంపిణీ చేస్తున్నారు. కాగా, ఎన్‌సీడీలో నమోదైన వారికి అత్యవసర వైద్య సహాయం అందించేందుకు.. ఆభా కార్డులతో తెలంగాణతో పాటు దేశ వ్యాప్తంగా ఎక్కడి నుంచైనా వైద్య సహాయం పొందేందుకు ఆయా బాధితులకు విధిగా నమోదు చేపడుతున్నామని వైద్య అధికారులు వెల్లడించారు. బీపీ, షుగర్ తదితర పరీక్షలు చేపట్టి ఆయా నివేదికల ఆధారంగా వారికి అవసరమైన మందులను ఇంటికి వెళ్లి అందజేయడంతో పాటు ఎన్‌సీడీ యాప్‌లో ఆభా కార్డుల నమోదు చేపడుతున్నారు. ఈ మేరకు శ్రీరాంనగర్ క్లస్టర్ పరిధిలోని యూసుఫ్‌గూడ డివిజన్‌లో శ్రీరాంనగర్ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఆశా వర్కర్‌లు ఎన్‌సీడీ సర్వే చేపడుతున్నారు.

ఓటరు జాబితా విడుదల చేస్తున్న డీసీ సేవా ఇస్లావత్, చిత్రంలో తదితరులు

జూబ్లీహిల్స్‌లో 3,87,206 మంది ఓటర్లు

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 8: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 3,87,206 మంది ఓటర్లు నమోదయ్యారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలోఎన్నికల సంఘం అధికారులు ఓటరు జాబితా ఫైనల్ పబ్లికేషన్ విడుదల చేశారు. ఇటీవల ప్రకటించిన ముసాయిదా ప్రకారం, తాజా జాబితాలో గణనీయంగా ఓటర్లు తగ్గారు. తుది ఓటరు జాబితాలో 2,02,172 మంది పురుషులు, 1,85,013 మంది మహిళలు, 21 మంది థర్డ్ జెండర్ ఓటర్లున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 3,56,995 మంది ఓటర్లుండగా 28 వేల పైచిలుకు ఓటర్లు పెరిగారు. యూసుఫ్‌గూడ జీహెచ్ ఎంసీ 19వ సర్కిల్ కార్యాలయంలో డీసీ సేవా ఇస్లావత్, ఏఎంసీలు కమల్, బాలరాజుతో కలిసి ఫైనల్ పబ్లికేషన్‌ను గురువారం విడుదల చేశారు.